క్లుప్తంగా

ప్రమాదకర బావికి రక్షణ గోడ నిర్మించండి



వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి కల్వరాలకు వెళ్లే ప్రధాన రహదారిలో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా బావి ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపు వద్ద ఉన్న బావికి రక్షణగోడను నిర్మించాలని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని కల్వరాల గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రివేళలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదవశాత్తు బావిలో పడే పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యథేచ్ఛగా రక్షణ కట్ట మట్టి తరలింపు



వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద రిజర్వాయర్‌కు రక్షణగా ఉన్న మట్టిని పలువురు యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జూరాల ప్రధాన కాల్వను తవ్వే సమయంలో రక్షణ కట్ట కోసం మట్టిని నిల్వ చేయగా పలువురు గుత్తేదారులు ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ విషయమై పలువురు ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందించడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలికి సన్మానం



పెబ్బేరు రూరల్: మండలానికి విశిష్ట సేవలు అందించిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మను ఆదివారం వనపర్తి జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని రంగాపురంలో ఆమెకు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవికి మాత్రమే విరమణ కానీ ప్రజాసేవకు విరమణ కాదన్నారు. కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్, కళాకారుడు డప్పు స్వామి, సురేష్, చెన్నయ్య, రవి, నాగరాజు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని యాదవ కమిటీ భవనంలో ఆదివారం 38వ సబ్ జూనియర్ కేటగిరి, 12వ సబ్ జూనియర్, 7వ తైక్వాండో టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు తైక్వాండో జిల్లా అధ్యక్షుడు స్వామి తెలిపారు. ఈ పోటీల్లో బంగారు పథకాలు సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ఈ నెల 19, 20, 21వ తేదీల్లో జరిగే తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని స్వామి తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, సీనియర్ రెఫరీలు యుగేంధర్‌గౌడ్, బుద్దారం రవికుమార్, కిషన్, శేఖర్, సవిద్, దీక్షిత్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ కాల్వలకు మరమ్మతు



అమరచింత: అమరచింత ఎత్తిపోతల పథకానికి సంబంధించిన కాల్వలకు మరమ్మతు పనులను లిఫ్ట్ నిర్వహణ కమిటీ చేపట్టింది. అమరచింత నుంచి సింగోపేట, ఖానాపురం గ్రామాల వరకు వెళ్తున్న ప్రధాన కాల్వ వెంట దెబ్బతిన్న లైనింగ్ వద్ద తాత్కాలిక మరమ్మతు పనులు చేపడుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని ఎప్పుడైనా విడుదల చేస్తారనే సమాచారంతో ముందస్తుగా లిఫ్ట్ పరిధిలోని అమరచింత, మస్తీపురం, మూలమళ్ల, సింగంపేట, ఖానాపురం, పాంరెడ్డిపల్లి గ్రామాల వరకు విస్తరించిన కాల్వలలో ప్రధాన సమస్యలను గుర్తించి సాగునీరు వృథా కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు లిఫ్టు అధ్యక్ష, కార్యదర్శులు సౌజన్యరెడ్డి, ఆంజనేయులు తెలిపారు.

అస్తవ్యస్తంగా గ్రామీణ రోడ్లు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు



గుంతలమయంగా మారిన పర్వతాపురం బీటీ రోడ్డు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతలమయమయ్యాయి. చిన్నపాటి ముసురు వాన కురిసినా గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనాలు తిరుగుతుండటంతో మడుగులను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ బురద గుంటలుగా మారడంతో గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్నా, మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు గుంతల్లో నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు నడిపే సమయంలో ఎప్పుడు ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని ప్రజలు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వర్షాలు కురుస్తే పర్వతాపురం, ఆగారం, అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా మడుగులుగా మారతాయని ఆయా గ్రామాల ప్రజలు తమ బాధలను వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్లకు మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. కనీసం ఈ సమయంలో గుంతల్లో కొంత మొర్రంమట్టి పోయించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మల్కిమియాన్‌పల్లి రోడ్డు



అల్లమాయపల్లిలో రోడ్డు దుస్థితి



అప్పారెడ్డిపల్లి వెళ్లే రోడ్డు

పేద విద్యార్థికి ఆర్థికసాయం



వనపర్తిలో..



విద్యార్థిని తండ్రికి నగదు అందజేస్తున్న వాసవీ సేవా సమితి సభ్యులు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన పేద విద్యార్థి ఉత్తనూర్ శిరీష ఉన్నత చదువుల కోసం వాసవీ సేవా సమితి జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టి సహకారంతో ఆర్థికసాయం అందజేశారు. ఈ ఆర్థికసాయాన్ని ఆదివారం సినీ ఆర్టిస్టు శ్రీ వాసవీ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర గౌరవ సలహాదారులు పసునూరి శ్రీనివాసులు విద్యార్థిని తండ్రి వేణుకుమార్‌కు రూ.55 వేలు ఆర్థికసాయాన్ని హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు దాత పూరి సురేష్‌శెట్టికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

శ్రీరంగాపురం మండలంలోని నాగరాల గ్రామానికి చెందిన నరసింహ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.5వేలు ఆర్థికసాయం పంపించారు. స్థానిక నాయకుడు నరేందర్‌రెడ్డి ఆదివారం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చిన్నాగౌడ్, శంకర్, శివ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డుకు చెందిన తయారబి ఆదివారం మృతి చెందిన విషయాన్ని నాయకుడు ఎల్‌ఐసీ కృష్ణ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అందించిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో తిరుపతి నాయక్, ప్రవీణ్‌సాగర్ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా దౌర్జన్యంగా భూములను తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో ఉన్న చెంచుగూడెన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆదివాసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్ఐ ప్రాజెక్టులో ఏడు ఎకరాల భూమి, పాలమూరు ప్రాజెక్టు డేగల బండ పెంట దగ్గర 10 ఎకరాల భూమిని చెంచుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు దౌర్జన్యంగా తీసుకున్నారని ఆరోపించారు. పరిహారం అడిగితే వారిపై కేసులు పెడుతామని బెదిరించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కొంత మంది అధికార పార్టీ నాయకులు చెంచుల భూములను ఆక్రమించుకున్నారన్నారు. ప్రభుత్వం చెంచుల భూములను వెంటనే వారికి ఇప్పివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 15న కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, చెంచులు పాల్గొన్నారు.

ఘనంగా కట్ట మైసమ్మ బోనాలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ బోనాలకు ముందుగా కట్ట మైసమ్మకు బోనం ఎత్తడం మండలకేంద్రంలో ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని తెలుగువాడ నుంచి పెద్దబోనం ఎత్తుకుని పెద్ద చెరువు వరకు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో తెలుగువాడ, కుర్వవాడ, దళితవాడల నుంచి పలువురు పెద్దలు పాల్గొన్నారు. కట్టమైసమ్మకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. ఈ నెల 19న శుక్రవారం తాయమ్మ బోనాల పండుగను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 23న మంగళవారం పోచమ్మ బోనాల వేడుక ఉంటుందని తెలిపారు.

క్రీడా ప్రాంగణంలో ‘సాగు’



మస్తీపురంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. కానీ మండలంలోని మస్తీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు ఏర్పాటు చేసినా.. ద్వారం నుంచి లోపలికి వెళితే అక్కడ క్రీడా సామగ్రి ఏది కనబడదు. అక్కడ పంటను సాగుచేస్తున్నారు. స్థలం తనదేనని గ్రామానికి చెందిన శివారెడ్డి ఇప్పటికీ రెండు సార్లు పంటలు వేయడం, అధికారులు వాటిని తొలగించడం జరిగింది. కానీ ముచ్చటగా మూడోసారి శివారెడ్డి అదే స్థలంలో పత్తిపంటను సాగుచేస్తున్నాడు. జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు పలువురు హౌర ఇది క్రీడా ప్రాంగణమేనా అంటూ అవాక్కవుతున్నారు.



సాగవుతున్న పంట

పీర్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

కోడేరు: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం పీర్లను దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో పీర్ల చావిడి మరమ్మతు కోసం రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మరమ్మతు పనులు పూర్తి కావడంతో మసీదు కమిటీ నాయకులు మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాజుగౌడు, నగం రవి, స్కైలాబ్ తదితరులు పాల్గొన్నారు.





గోకులపాడులో మిరప బెడ్లను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన చీర

మిరప నారుకు ‘చీర’ కంచు

మానవపాడు: పంటలను సాగుచేసిన రైతులు పొలంలో వేసిన మొక్కలను కాపాడుకోడానికి వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని గోకులపాడులో మిరప నారును సాగు చేస్తున్న రైతు నరసింహులు పశువులు, కుక్కలు, పందుల నుంచి మిరపను కాపాడుకోవడానికి మిరప బెడ్ల చుట్టూ చీరను కట్టాడు. పంటను కాపాడుకోడానికి కష్టాలు తప్పవంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి జన్మదినాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్ వృద్ధాశ్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ డెలికేట్ శంకర్‌ప్రసాద్, లక్కాకుల సతీష్ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేసి వృద్ధులకు, నాయకులు ఒకరికొకరు తినిపించుకుంటూ మల్లు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందిన మల్లు రవి అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజానాయకుడైన ఎంపీ మల్లు రవి ప్రజల ఆశీస్సులతో రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నందిమల్ల భువనేశ్వరి, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమేష్, నాయకులు రాంరెడ్డి, షఫీ కైరున్, మాజీ డైరెక్టర్ లతీఫ్, గట్టు చిరంజీవి, నరేష్, హరీష్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

- పొంచి ఉన్న ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని కమ్మేసిన చెట్లు, తీగలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్లు, తీగలు అల్లుకున్నాయి. ఈదురుగాలులకు, వర్షాలకు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కూడా ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. స్తంభం చుట్టు ఉన్న గడ్డి, ఆకులు తినేందుకు మూగ జీవులు వెళ్తున్నాయని, దీంతో అవి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉండటంతో విద్యార్థులు సంచరిస్తుండటంతో స్తంభానికి అల్లుకున్న తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్సీ హాస్టల్ సందర్శన



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ మూసి ఉండటంపై వారు విస్మయం వ్యక్తం చేస్తూ.. మూసి ఉండడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్ వార్డెన్లు సమయపాలన పాటించే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్ ఆంజనేయులును వివరణ కోరగా.. రెండు రోజులు సెలవులు రావడంతో విద్యార్థులందరూ సొంత గ్రామాలకు వెళ్లారని తెలిపారు. హాస్టల్ వాచ్‌మెన్ మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లడంతో హాస్టల్ మూసి ఉందన్నారు. దీంతో పాటు శ్రీరంగాపూర్ హాస్టల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా తానే చూస్తుండటంతో శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి వెళ్లి సాయంత్రం పాన్‌గల్ హాస్టల్‌కు వచ్చానని ఆయన పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్.. పేదలకు వరం



చెన్నిపాడులో అలీమ్‌బీకి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్యఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజలకు అందిస్తుందన్నారు. మద్దూరు లక్ష్మన్నకు రూ.21 వేలు, రాజ్‌కుమార్‌కు రూ.60,000, చిన్నపోతులపాడులో మద్దిలేటికి రూ.12,000, చెన్నిపాడు మాదిగ బీసన్నకు రూ. 21,000, పి.అలీమ్‌బీ రూ.12,000, పెద్దఆముదాలపాడులో జి. నరసింహులు రూ.20,000, నారాయణపురంలో పి.శివమ్మకు రూ.14,000, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మానవపాడు నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు రోడ్డు నిర్మాణానికి సంబంధించి వినతి పత్రం అందించారు. అదేవిధంగా చెన్నిపాడు గ్రామం నుంచి కొర్విపాడు స్టేజీకి వెళ్లే మట్టి రోడ్డు కోసం మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు జ్ఞానేశ్వర్‌రెడ్డి, తిరుమాల్‌రెడ్డి, రాజారెడ్డి, రఘురెడ్డి, మద్దిలేటి వినతి అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఇమామే ఖాసీం ఆలం సవారీ



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

అమరచింత: మొహర్రం వేడుకల్లో భాగంగా ఏడో రోజు ఇమామే ఖాసీం పీర్ల సవారీ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని నందిమళ్ల, మస్తీపురం, చంద్రగఢ్, మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె, సింగంపేట, పాంరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్, అమరచింత గ్రామాల్లోని పీర్ల చావిడీలలో కొలువుదీరిన ఇమామే ఖాసీం పీర్లు (ఆలం)ను భక్తులు మాలీద, కిచిడి, షర్బత్‌లతో నైవేద్యం సమర్పించుకున్నారు. తమ చిన్నారులకు ఫకీర్‌లుగా దండలు వేయ్యించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూర్‌లో దంచికొట్టిన వాన



ఆత్మకూర్ సంతబజారులో వినియోగదారుల ఇక్కట్లు


ఆత్మకూర్: ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ఎడతెరపి లేకుండా కురవడంతో అతలాకుతలంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి దాక వాన దంచికొట్టింది. విద్యుత్ తీగలు తెగిపడడంతో ఆత్మకూర్‌లో అంధకారం నెలకొంది. మున్సిపాలిటీ కేంద్రంలోని రోడ్లపై వర్షం నీరు చేరి గుంతలమయంగా మారాయి. అన్ని వార్డుల్లో పరిస్థితి ఇలాగే ఉండడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపు నీరు భారీగా చేరడంతో పలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆదివారం సంత కావడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు ముప్పతిప్పలు పడ్డారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రైతులు సంతోషిస్తున్నారు.

చినుకుపడితే రోడ్డు చిత్తడే..

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి, కేతేపల్లి సమీపంలో రోడ్డు విస్తరణలో భాగంగా అసంపూర్తిగా మిగిలిన రోడ్డుపై గుంతలు ఏర్పడి చినుకుపడితే చిత్తడిగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. వనపర్తి వయా పాన్‌గల్ మీదుగా ఉన్న కొల్లాపూర్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు కావడంతో ప్రతినిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డును ఏళ్ల గడిచినా నేటికీ పూర్తి చేయకపోవడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డును పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



పాత మున్సిపాలిటీ రోడ్డుపై..



బస్టాండ్ రోడ్డుపై నిలిచిన నీరు



కేతేపల్లి సమీపంలో రోడ్డు